


## నెలనెలా నవ్వుల పండగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకటకృష్ణమూర్తి**

### ఇంద్రుడు - రాజకీయ నాయకుడూ!

**ఒకరోజు** దేవలోకంలోని ఇంద్రుడు ఇండియా నుంచి వచ్చిన అనేకమంది నాయకులతో ఒక మీటింగ్ ఏర్పాటు చేశాడు.



"హరే రామ హరే కృష్ణ " వారి నాయకుడు, "భగవద్గీత పారాయణ సంఘం" వారి నాయకుడు, టి.టి.డికి చెందిన ఓ పుణ్యాత్ముడు..ఇలా అనేకమంది రాగానే లేచి నిలబడి ప్రతివారితో కరచాలనం చేసి "ఎలా వున్నారు?" అని ఇంద్రుడు చిరునవ్వుతో పలకరించ సాగాడు.

అయితే ఓ వ్యక్తి రాగానే అతనివంక చూసి తలపంకించి "వెళ్ళి మీ సీట్లో కూర్చోండి" అన్నాడంతే!

ఇది గమనించిన ఓ వ్యక్తి ఇంద్రుడ్ని ఆసక్తిగా అడిగాడు.

"ఇంద్రదేవా! ఎందుకని మీరు అందరు నాయకులకూ గౌరవం ఇచ్చి ఒక్క తెల్లపంచె వ్యక్తిపట్ల నిరాదరణగా ఉన్నారు? లేచి నిలబడి అతనితో కరచాలనం చేయలేదే?"

"వాడు రాజకీయనాయకుడు. లేచి నిలబడితే వాడు నా సీట్లో కూర్చుంటాడని!" జవాబు చెప్పాడు ఇంద్రుడు.!!

❋❋

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ప్రఖ్యాత సినిమా తారను ఇంటర్వ్యూ చేస్తున్నాడు ప్రఖ్యాత పత్రికా విలేఖరి.
"మీరింత వరకు పెళ్ళి చేసుకోకపోవడానికి ప్రత్యేకమైన కారణమేమయినా ఉందా?"
"ఉంది. నేను మా అమ్మ మాట జవదాటను. ఆమె అడుగు జాడల్లోనే నడుచుకుంటున్నాను. ఆమె కూడా అసలు పెళ్ళి చేసుకోలేదు" గర్వంగా జవాబు చెప్పింది అభినేత్రి.

❧❧❧

"ఉత్తరదేశంలో పెళ్ళి కొడుకు వివాహమండపానికి గుర్రం ఎక్కి వెళ్ళడం రివాజు. ఒక దక్షిణాది వాడికి అనుమానమొచ్చి స్నేహితుడిని అడిగాడు.
"పెళ్ళికొడుకు గుర్రమే ఎక్కి ఎందుకు వెళ్ళాలి? నదరైన గాడిదనెక్కి వెళ్తే తప్పేమిటి?"
"నిజమే కాని, ఒకేసారి రెండు గాడిదలను చూసి పెళ్ళికూతురు భయపడుతుందని పెద్దవాళ్ళు ఒప్పుకుని ఉండరు."

❧❧❧

మనవడు: తాతయ్యా! ఓటరంటే ఎవరు?
తాతయ్య: అన్నీ తెలిసి యమబాధలనుభవిస్తూ కూడా తనను పాలించడానికి చవటలను, దద్దమ్మలను ఎన్నుకునే ఘనుడురా మనవడా!

❧❧❧

"నమస్కారం రామాయమ్మగారూ" పలకరించిందొకామె ఎదురుగా వస్తున్న ఒక పెద్దావిడను. మొహం తిప్పుకుని వెళ్ళిపోయిందావిడ.
"అదేమిటొదినా బదులే చెప్పకుండా పోతోందేమిటి?" అంది వెంటనున్నావిడ.

"ఆవిడ మా పక్కింటావిడ. పుచ్చుకోవడమేగాని తిరిగివ్వడం ఆవిడకు అలవాటు లేదు. కొన్ని జాతకాలు అంతే"

కాలేజీ కాంపస్‌లో ఆ ఇద్దరు యువకుల ముందు నుంచే వెళ్ళిందో అమ్మాయి.
"ఆ అమ్మాయి చూడు చాలా అమాయకురాలు పాపం. ఈ మధ్యనే పల్లెటూరి నుంచి బస్తీకొచ్చింది. మంచీ చెడు తెలియవు."
"దానికేం? మంచి ఏమిటో నువ్వు నేర్పు. చెడు నేర్పే బాధ్యత నాకొదిలేయ్. నేను చూసుకుంటాను."

"ఆశావాది, ఆశావాది అని తెగ అంటుంటారు. అతనెలా ఉంటాడు?"
"అందరిలాగానే ఉంటాడు. కాని రూపాయి పెట్టి లాటరీ టిక్కెట్టుకొని, ఫస్టు ప్రయిజొస్తుంది లెమ్మని ఇల్లు కట్టుకోడానికి యాభైవేళ రూపాయల స్థలం బేరమాడి వస్తుంటాడు."

"ఐ యామ్ సారీ మిస్టర్. మీ ఆవిడ మతిస్థిరంగా లేదు."
"ఆ సంగతి నాకు పాతికేళ్ళనుంచి తెలుసుగానీ ఇంకేదైనా కొత్త జబ్బు ఈ మధ్య తగిలిందేమో చూడండి డాక్టారూ."

"ఇద్దరు స్నేహితులు –
"ఇన్ని చెడలవాట్లుంటే నువ్వెన్నాళ్ళు బతుకుతావురా. నిన్ను చూస్తే జాలేస్తోంది."
"కిందటి వారం అన్నీ మానేశాను. మదిర, మగువ, ధూమపానం మొత్తం అన్నీ."
"చాలా సంతోషంరా. ఇన్నాళ్ళకు నీకు బాగుపడాలనే ఆలోచన వచ్చినందుకు."
"కాని ఒరేయ్ మానేసిన ఆ గంట మాత్రం యమచర అనుభవించాననుకో. అబ్బ!"

అమెరికా అధ్యక్షుడు అబ్రహామ్ లింకన్‌కి ఓసారి మసూచి వచ్చింది. ఆ జబ్బు అంటుతుందేమోనని ఆయన దగ్గరకు జనం రావడం మానేశారు.

"అది కావాలి, ఇది కావాలని రోజూ వందలమంది వస్తుండేవారు. ఇప్పుడు వాళ్ళు అడక్కుండానే నా దగ్గరున్న దాన్ని ఫ్రీగా ఇద్దామని నేననుకుంటుంటే ఒక్కళ్ళు కూడా దరిదాపులకి రావడంలేదు" అన్నాడు అధ్యక్షుడు లింకన్ తన ప్రైవేటు సెక్రటరీతో.

“అబద్ధాలు చెప్పకు. గాంధీలా ఉండటానికి ప్రయత్నించు."

"ఎక్కడున్నాడో చెప్పు. చూసొస్తాను."

"ఓరి మూర్ఖుడా జాతిపిత సంగతే తెలియదా? ప్రపంచమంతా పూజించిన మహాత్ముడురా ఆయన."

"అదేపనిగా కొయ్యక. నాకు తెలుసులే. ఆయన అంత మంచి వాడైతే ఆయన పుట్టినరోజుకి బాంకులకి సెలవెందుకిస్తారు?"

COMMENTS